
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ■ 18 ■ జూన్ ■ 2024



సోమశిలలో 8.960 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 8.960 టీఎంసీల నిల్వ ఉంది. 1320 క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతోంది. దిగువకు 200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.74,200
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,664
3శాతం జీఎస్టీతో	రూ.6,864
నవర (8 గ్రా)	రూ.54,912

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.2 /30.8

జిల్లాలో మంగళవారం వాతావరణం మేఘావృతంగా ఉంటుంది. మరో వైపు ఎండ తీవ్రత కూడా అధికంగా ఉండే అవకాశం. వాతావరణంలో తేమ 56 శాతం ఉంది.

న్యూస్‌రీల్

20న పెన్షనర్ల సమావేశం

నెల్లూరు(అర్బన్): ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్ల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 20వ తేదీ గురువారం జరుగుతుందని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.లక్ష్మీనారాయణ, వెంకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు నగరంలోని పురమందిరం (టౌన్ హాలు) ఆవరణలోని వర్ధమాన సమాజంలో నిర్వహిస్తున్నామన్నారు. డీఏ బకాయిలు, హెల్త్ కార్డులు, ఇతర ప్రధాన సమస్యలను చర్చిస్తామని తెలిపారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నేడు సమీక్ష

దుత్తలూరు: మండలంలోని నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి ప్రారంభం కానుండగా ఏర్పాట్లపై మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కావలి ఆర్డీఓ శీనానాయక్ అధ్యక్షతన సమీక్ష సమావేశం జరుగుతుందని ఆలయ ఈఓ ఉషశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమీక్ష సమావేశానికి అన్ని శాఖల అధికారులు తగిన సమాచారం, ప్రణాళికతో హాజరుకావాలని కోరారు. బుధవారం ఉదయం 10 గంటలకు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో ఆలయ హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు.

పశుసంచార అంబులెన్స్‌లో ఖాళీ పోస్టుల భర్తీ

నెల్లూరు (వీఆర్సీసెంటర్): పశుసంచార అంబులెన్స్ 1962 వాహనంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నెల్లూరు జిల్లా మేనేజర్ శివశంకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న పశు సంచార అంబులెన్స్ వాహనంలో పైలెట్, పారావిట్, డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పైలెట్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణత కలిగి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కానీ, బ్యాడ్జి లైసెన్స్ కానీ కలిగి ఉండాలని తెలిపారు. పారావిట్ పోస్టుకు వెటర్నరీ డిప్లొమా అర్హత కలిగి ఉండాలని, డాక్టర్ పోస్టుకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అర్హత కలిగి ఉండాలని వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీన నగరంలోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఉన్న పశు సంవర్ధకశాఖ జేడీ కార్యాలయంలో ఉన్న 1962 ఆఫీస్‌ను సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 97041 65512 నంబరులో సంప్రదించాలని కోరారు.

కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ చైర్మన్, సభ్యుల రాజీనామా

ఇందుకూరుపేట: ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్ రెడ్డి, సభ్యులు చిట్టిబోయిన కృష్ణప్రసాద్, సంగం వెంకయ్య తమ పదవులకు సోమవారం రాజీనామా చేశారు. సొసైటీ కార్యదర్శి మహేష్‌కు రాజీమానా పత్రాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో బాధ్యత వహిస్తూ తాము రాజీనామా చేస్తున్నట్లు వివరించారు. తాను స్థానికంగా లేకపోవడంతోనే రాజీనామా చేయడం కొంత ఆలస్యమైందని సురేష్‌రెడ్డి వివరించారు.

నిలకడగా నిమ్మ ధరలు

సైదాపురం: గతేడాదితో పోల్చి చూస్తే ఈసారి నిమ్మ ధరలు నిలకడగా ఉన్నాయి. దిగుబడి కూడా ఆశించిన స్థాయిలోనే ఉన్నట్లు రైతులు వెల్లడించారు. ప్రస్తుతం కిలో నిమ్మ కాయలు రూ.40 నుంచి రూ.65 వరకు ధర పలుకుతున్నాయి. వేసవిలో నిమ్మకాయలకు ఎక్కువగా డిమాండ్ ఉన్నా ధరలు పెరగలేదని రైతులు చెబుతున్నారు. ధరలు కూడా ఆశాజనకంగా ఉండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఫీడ్ ధర దౌడ్

జిల్లాలో ఆక్వా రైతులను సీడ్, ఫీడ్ వ్యాపారులు దోచుకుంటున్నారు. రొయ్యల మేత ధరలు ఇటీవల దశల వారీగా భారీగా పెరిగాయి. మరో వైపు రొయ్యల ధరలు సైతం పతనమయ్యాయి. ఈ పరిణామాలతో జిల్లాలో నీలి విప్లవానికి నాంది పలికిన రొయ్యల సాగు ప్రస్తుతం ఆక్వా రైతులు అప్పుల పాలవుతున్నాయి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులను ఆదుకునేందుకు ప్రణాళికలు రూపొందించింది. సీడ్, ఫీడ్ ధరలను నియంత్రణలో ఉంచడంతో పాటు రొయ్యలకు కూడా గిట్టుబాటు ధరలను కల్పించే దిశగా అడుగులు వేసింది. దీంతో ఆక్వా రంగం మళ్లీ పుంజుకుంటే.. తాజాగా ఒక్కసారిగా కుప్పకూలిపోయింది.

ఇటీవల టన్నుకు రూ.20 వేల వరకు పెరుగుదల

- ప్రస్తుతం టన్ను మేత రూ.89 వేలు
- ఎకరాకు 3 నుంచి 4 టన్నుల మేత వినియోగం
- జిల్లాలో 70 వేల ఎకరాల్లో ఆక్వా సాగు
- క్రాప్‌లో ఎకరాకు రూ.80 వేల అదనపు భారం
- సీడ్ ధరల పెరుగుదలతో ఎకరాకు రూ.30 వేల అదనపు వ్యయం



బిట్రగుంట: రొయ్యల మేత ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ పరిణామాలు ఆక్వా సాగుకు ఉపద్రవంగా మారనుంది. జిల్లాలో గత ఐదేళ్లుగా ఆక్వా సాగు గణనీయంగా పెరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆక్వా విద్యుత్ చార్జీలపై యూనిట్‌పై రెండు రూపాయిలు తగ్గింపు, ఉచితంగా ఆక్వా ల్యాబ్‌ల ఏర్పాటు, నాణ్యమైన సీడ్ అందేలా మత్స్యశాఖ పర్యవేక్షణ, దళారుల నియంత్రణ, గిట్టుబాటు ధరలకు కొనుగోళ్లు, లాక్ డౌన్‌లో సైతం ఎగుమతులకు అనుమతులు తదితర లాభసాటి ప్రయోజనాలతో ఆక్వా సాగు జిల్లాలో 30 శాతం మేర పెరిగింది. ఇదే అదనుగా వ్యాపారులు ఆక్వా ఫీడ్ ధరలు ఉన్న పళంగా పెంచేశారు. మేతకు అవసరమైన సోయాబీన్ ధరలు పెరిగాయనే నెపంతో టన్ను మేతపై ఏకంగా రూ.20 వేలు వరకు ఆదనంగా పెంచేయడంతో ఆక్వా రైతులు కుదేలవుతున్నారు.

మేత వినియోగాన్ని బట్టి పంట ఉత్పత్తి

ఆక్వా రైతులు గుంతల్లో వదిలి పెట్టే సీడ్ తినే మేత వినియోగాన్ని బట్టి పంట ఉత్పత్తి లభిస్తోందని అంచనా. గుంతల్లో నాలుగు వైపుల చెక్ ట్రేలు అమర్చుతారు. ప్రతి సారి మేత వేసేటప్పుడు ఒక శాతం మేతను చెక్ ట్రేల్లో వేస్తారు. ఈ ట్రేల్లో వేసిన మేతను గంట నుంచి గంటన్నరలోగా పూర్తిగా తినే దాన్ని బట్టి గంతలో ఎంత మేర డెన్సిటీ ఉంటుందో అంచనా వేస్తారు. ఇలా ఎకరానికి 4 టన్నుల మేతను వినియోగిస్తారు. మేతలో ఐదు నంబర్ల రకాలు ఉంటాయి. వాస్తవానికి ఆక్వా సాగు నాలుగు నెలల కాల వ్యవధి. నెలకు 7 నుంచి 8 గ్రాముల చొప్పున పెరుగుతోంది. ఈ లెక్కన నాలుగు నెలల్లో 30 నుంచి 35 కౌంట్‌కు రొయ్యలు పెరుగుతాయి. ప్రస్తుతం రైతులు వంద కౌంట్‌కు వస్తే చాలన్నట్లుగా నెలన్నర నుంచి రెండు నెలల్లోనే హార్వెస్ట్ చేస్తున్నారు. ఎంత మేత వినియోగిస్తే.. అంతే స్థాయిలో ఉత్పత్తి రావాలి.

క్రాప్‌కు 2.80 లక్షల టన్నుల వినియోగం

జిల్లాలో 70 వేల ఎకరాల్లో 17 వేల మంది రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. అందుకు సంబంధించి ఆక్వా రైతులు ఒక క్రాపులో ఎకరాకు 4 టన్నుల చొప్పున ఏడాదికి 2.80 లక్షల టన్నుల రొయ్య మేత, 75 వేల టన్నుల కెమికల్స్ కొనుగోళ్లు చేస్తారు. ప్రకృతి సహకరిస్తే సుమారుగా క్రాప్‌నకు 2.5 – 3 లక్షల టన్నుల రొయ్యల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

పెరిగిన ఫీడ్, సీడ్ ధరలు ఇలా

ఆక్వా సాగుకు సంబంధించి వివిధ రకాల కంపెనీలకు చెందిన రొయ్యల మేతలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. సుమారు ఎనిమిది కంపెనీలకు చెందిన మేతలు జిల్లాలో లభ్యమవుతున్నాయి. వీటిలో ఒక ప్రముఖ కంపెనీకి చెందిన ఫీడ్ టన్ను ధర గతంలో రూ. 70 వేలు ఉండగా, ఇప్పుడు రూ. 90 వేలుకు చేరింది. మొన్నటి వరకు ఒక ఎకరా రొయ్య సాగులో రూ. 80 వేలు వ్యయంతో వివిధ రకాల కెమికల్స్ వాడగా, ప్రస్తుతం అదే కెమికల్స్ రూ. 1.10 లక్షల వరరే ఖర్చు పెరిగింది. ఇలా అధికమైన ధరలతో రైతుల నుంచి ఫీడ్ వ్యాపారులు ఏడాదికి దాదాపు రూ. 70 కోట్ల వరకు దోచుకుంటున్నారు. ఇక పలుచోట్ల 20 పైసలతో అమ్మకాలు జరుపుతున్న ఒక రొయ్య పిల్ల 30 పైసలకు చేరింది. ఇలా ఎకరా చెరువులో 3 లక్షల పిల్లను (హై డెన్సిటీ పద్ధతిలో) వదులుతారు. అంటే ఎకరా చెరువుపై రైతు రూ. 30 వేలు నష్టపోతున్న పరిస్థితి. పాత ధరల పెట్టుబడులతో ఎకరా సాగులో రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు రైతులకు ఆదాయం వచ్చేది. అయితే పెరిగిన ఫీడ్, సీడ్ ధరలతో సాగు అనుకూలంగా వస్తే రూ. 1.50 లక్షలు ఆదాయం వస్తుంది. ఏ మాత్రం తేడా వచ్చినా రైతులు ఎకరాకు రూ.3 లక్షల నుంచి రూ.4లక్షలు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

నియంత్రణ లేకుంటే నష్టమే

ఆక్వాసాగులో కీలకమైన సీడ్, ఫీడ్, మందుల విషయంలో ప్రభుత్వ నియంత్రణ లేకుంటే జిల్లాలో రొయ్యసాగు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఫీడ్ విషయంలో తయారీదారులు దోపిడీకి తోడు నాణ్యతలేని సీడ్, మందుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆక్వా సాగులో రైతులకు అంటగట్టే మందుల్లో కనీసం 80 శాతం నకిలీ మందులు, అధిక ధరలకు విక్రయిస్తున్న మందులే ఉంటున్నాయి. వీటిలో నాణ్యతా ప్రమాణాలు నిర్దేశించే యంత్రాంగం లేకపోవడంతో వ్యాపారులు ఆడిందీ ఆటగా పాడింది పాటగా మారింది. సంబంధిత యంత్రాంగం స్పందించి ధరల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోకుంటే ఆక్వా రంగం కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

మేత వినియోగాన్ని బట్టి పంట ఉత్పత్తి

ఎప్పుడు ఏ మేత

రోజులు	నంబరు	టన్ను ధర (రూ.ల్లో)
7	1	88,800
25	2	88,800
35	3	88,000
40	3 ఎస్	87,200
తర్వాత	3 పీ	87,200



రొయ్యల గుంతలో ఫీడ్ వేస్తున్న రైతు

జిల్లాలో 75 హేచరీలకే అనుమతి

ఉమ్మడి జిల్లా తీరం వెంబడి 125 వరకు రొయ్య పిల్లల హేచరీలు ఉన్నాయి. అందులో 75 హేచరీలకు మాత్రమే అధికారికంగా అనుమతులు కలిగి ఉండడం విశేషం. సీఏఏ పర్మిషన్‌తో 66 హేచరీలు, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పర్మిషన్‌తో 9 నడుస్తున్నాయి. మిగిలిన 50 హేచరీలు అనధికారికంగా నడుస్తున్నాయి. వీటిలో సీడ్ నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. నాణ్యత లేని సీడ్‌ను రైతులకు అంటగడుతుండటంతో 50 శాతం పిల్లలు కూడా బతకడం లేదు. మరో వైపు నాణ్యత లేని సీడ్ కారణంగా ఎదుగుదల సరిగా ఉండకపోవడం, ఎక్కువగా వ్యాధులకు గురవుతుండడంతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నాణ్యత లేని సీడ్ కారణంగా మందులు కూడా అధికంగా వినియోగించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యల ఎదుగుదల కోసం, వ్యాధులు తట్టుకునేందుకు విపరీతంగా మందులు వాడాల్సి వస్తుందని చెబుతున్నారు. మందుల్లో కూడా నాణ్యత లేకపోవడంతో దిక్కు తోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు.

ఫీడ్ ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలి



ఆక్వా రంగానికి సంబంధించి ఫీడ్ ధరలు పెరుగుతూ పోతున్నాయి. దీంతో సాగుకయ్యే ఖర్చు కూడా పెరుగుతుంది. గత ప్రభుత్వం ఆరు నెలల వరకు కూడా ఫీడ్, సీడ్ ధరలు నియంత్రణలోనే ఉన్నాయి. ఎన్నికల సమయంలో ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడడంతో తాజాగా ఫీడ్ ధరలు అమాంతంగా పెరిగాయి. సంబంధిత అధికారులు ఫీడ్ ధరల విషయంలో చర్యలు చేపట్టాలి.

– గుమ్మడి వెంకటేష్, ఆక్వా రైతు, ఇస్కపల్లి అల్లూరు మండలం

ఆక్వా రంగం అతలాకుతలం



సీడ్ కంటే ఫీడ్ ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. మరో వైపు ఆక్వా కౌంట్ల వారీగా ధరలు కూడా పతనమవుతున్నాయి. ఈ పరిణాలు ఇలాగే కొనసాగితే ఆక్వా రంగం అతలకుతలం అవుతుంది. గతంలో కొంత మేర రొయ్యల ధరలు బాగా ఉన్నాయి. ఇదే సమయంలో ఫీడ్ వ్యాపారులు వాటి ధరలను పెంచేశారు. రెండు..మూడు రోజుల్లో 25 కేజీల బస్తాపై రూ.100 పెరిగింది. ప్రభుత్వాలకు సంపద సృష్టించే రంగాల్లో ఆక్వా ఒకటిగా చెప్పొచ్చు.

– ఊటుకూరు శ్రీనివాసులు, ఆక్వా రైతు, కోడూరు, తోటపల్లిగూడూరు మండలం



అల్లాహ్ సందేశాన్ని ప్రవచిస్తున్న ముస్లిం మత పెద్ద సయ్యద్ అబూబకర్ అష్రఫి సాబిరి



బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రులు ఆనం, నారాయణ, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ముస్లిం మత పెద్దలు తదితరులు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండలాలు, గ్రామాల్లో ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు బక్రీద్ విశిష్టతను, అల్లాహ్ సందేశాన్ని ప్రవచించారు. ప్రధానంగా నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలో జరిగిన బక్రీద్ ప్రార్థనల్లో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరునగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

19, 20 తేదీల్లో ఐటీఐ కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్): 2024–25వ విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో సీట్లు కేటాయించేందుకు ఈ నెల 19, 20 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐఐటీ కన్వీనర్, ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. 19న మెరిట్ నంబరు 1 నుంచి 150 వరకు, పదో తరగతిలో గ్రేడ్ 10 నుంచి 6.8 వరకు, మధ్యాహ్నం 151 నుంచి 300 వరకు, గ్రేడ్ 6.8 నుంచి 5.7 వరకు, 20న మెరిట్ నంబరు 301 నుంచి 450 వరకు, గ్రేడ్ 5.7 నుంచి 4.7 వరకు, మధ్యాహ్నం మెరిట్ నంబరు 451 నుంచి 620 వరకు, గ్రేడ్ 4.7 నుంచి 1.8 వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

ఐటీఐతో ఉజ్వల భవిష్యత్

ఉన్నత విద్య చదివితేనే ఉద్యోగావకాశాలు ఉంటాయన్న ప్రచారం వాస్తవం కాదని ఐటీఐ చదివిన విద్యార్థులు నిరూపిస్తున్నారు. పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో తమకు నచ్చిన ట్రేడ్‌లో శిక్షణ పొంది పలు కంపెనీల్లో ఉద్యోగాలు పొందుతున్నారు. పదో తరగతి పూర్తి చేసి ఐటీఐ చదివి తమలో దాగి ఉన్న ప్రతిభను కనబరిచి ఎంతో మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కించుకుంటున్నారు.

- ముగిసిన దరఖాస్తు గడువు
- 620 మంది విద్యార్థుల దరఖాస్తు
- రేపటి నుంచి తొలి విడత కౌన్సెలింగ్
- జిల్లా 6 ప్రభుత్వ, 17 ప్రైవేట్ ఐటీఐలు
- అందుబాటులో 2800కు పైగా సీట్లు
- ఐటీఐ పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలు మెండు
- ప్రతి ఏటా ఉద్యోగ మేళాలు

నెల్లూరు (టౌన్): జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పలు కంపెనీలను జిల్లాలో ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. దీంతో జిల్లాలో ఐటీఐ పూర్తి చేసిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆయా కంపెనీల్లో ఉద్యోగాలకు నైపుణ్యం కలిగిన కార్మికులు, ఉద్యోగులు అవసరం కావాల్సి ఉండడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసి నైపుణ్యాలపై శిక్షణ అందించింది. దీంతో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఐటీఐల్లో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు.



వివిధ ట్రేడుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

జిల్లాలో 2804 సీట్లు

జిల్లాలో మొత్తం 26 ఐటీఐలు ఉన్నాయి. వీటిల్లో ప్రభుత్వ 6, ప్రైవేట్ 17 ఐటీఐలు ఉన్నాయి. ప్రభుత్వ ఐటీఐల్లో 924, ప్రైవేట్ ఐటీఐల్లో 1880 సీట్లు వివిధ ట్రేడ్‌ల్లో ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు 620 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఐటీఐల్లో ప్రధానంగా ఎలక్ట్రికల్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ఎలక్ట్రికల్ మెకానిక్, టర్నర్, స్టెనోగ్రఫీ, కంప్యూటర్ ఆపరేటర్ టెక్నాలజీ, టైలరింగ్, డ్రస్ మేకింగ్, రేడియో టెలివిజన్, ఇన్ స్ట్రుమెంట్ మెకానిక్, మోటార్ మెకానిక్, రిఫ్రజిరేటర్, ఎయిర్ కండీషనింగ్, డ్రోన్ టెక్నీషియన్ తది తర కోర్సులు, ఏడాది, రెండేళ్ల వ్యవధిలో ఉన్నా యి. ఏడాది కోర్సుల్లో వెల్డర్, టర్నర్‌లకు మంచి డిమాండ్ ఉంది.

అప్రెంటీస్‌షిప్

2022	60 మంది
2023	55 మంది
2024	70 మంది
ఉద్యోగ మేళా ద్వారా సాధించిన ఉద్యోగాలు	
2022	120 మంది
2023	65 మంది
2024	45 మంది

విద్యార్థులకు అప్రెంటీస్‌షిప్ మేళా

ఐటీఐల్లో ఏడాది, రెండేళ్ల కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు అప్రెంటీస్‌షిప్‌ను నిర్వహిస్తున్నారు. జిల్లాలో సీమెన్స్ గమేషా, కృష్ణపట్నం, ఏపీ జెన్‌కో, మేనకూరు సెజ్, శ్రీసిటీ సెజ్, భార్గవి ఆటోమొబైల్ తదితర వాటితో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ప్రతి ఏటా ఈ కంపెనీల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐలో ఉద్యోగ మేళా నిర్వహించి అక్కడ ఎంపికైన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వ ఐటీఐలో కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఐటీఐల్లో ఏసీ మెకానిక్, ఎలక్ట్రీషియన్, స్ట్రీట్ లైట్, పైపు బెండర్ తదితర కోర్సులు పూర్తి చేసిన వారికి పార్ట్‌టైం కింద 3 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2022లో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేశారు. ఎలక్ట్రికల్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్లంబర్, వెల్డర్, ఆటోమొబైల్ తదితర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు 2 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అపారం



ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అపారంగా ఉన్నాయి. ఐటీఐల్లో ఉద్యోగాలు సాధించే విధంగా నైపుణ్య శిక్షణను అందజేస్తున్నాం. ఐటీఐల్లో శిక్షణ పొందిన వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయి. ఐటీఐ పూర్తి చేసిన వారు పాలిటెక్నిక్ కోర్సుల్లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో చేరవచ్చు. ఐటీఐల్లో అన్ని ట్రేడుల్లో కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

– కె.శ్రీధర్‌రెడ్డి, కన్వీనర్, ఐటీఐ, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్

ప్రమాదమని తెలిసినా..

నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పలువురు ప్రాణాలను కోల్పోతుండగా ఎందరో క్షతగాత్రులవుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారి వల్ల ఇతరులూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మోటార్‌బైక్‌ను నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదు. ఒకే బైక్‌పై ముగ్గురు ప్రయాణించకూడదు. మైనర్‌లు వాహనాలు నడపరాదు. కానీ చాలామంది ఈ విషయాలను పట్టించుకోవడం లేదు. నెల్లూరు నగరంలో పలువురు ద్విచక్ర వాహనదారులు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్నారు. పోలీసులు పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్నా వారిలో కనీస స్పందన లేదు.

– నెల్లూరు(క్రైమ్‌)


ఒకవైపు హ్యాండిల్‌ వదిలేసి ఫోన్‌ మాట్లాడుతూ..


ఒకే బైక్‌పై నలుగురు తప్ప కదా..


ఎవరూ అడగరనే ధైర్యంతో ముగ్గురూ దర్జాగా..


నిబంధనలు మాకు పట్టవంటూ..

పేదల బియ్యం పక్కదారి

పేద ప్రజలకు చేరాల్సిన బియ్యం పక్కదారి పడుతోంది. కొందరు ఉద్యోగుల సహకారంతో అక్రమార్కులు బియ్యంను రైస్‌మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కందుకూరు, ఉదయగిరి, మర్రిపాడు, ఆత్మకూరు, వింజమూరు తదితర ప్రాంతాల నుంచి బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

- కొందరు డీలర్లు, అధికారుల కుమ్మక్కు
- అక్రమ మార్గంలో రైస్‌మిల్లులకు తరలిస్తున్న వైనం

నెల్లూరు(పొగతోట): జిల్లాలోని 38 మండలాల్లో 7,22,240 రేషన్‌ కార్డులున్నాయి. ప్రతి నెలా బియ్యం, కందిపప్పు, చక్కెరను చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. మొత్తం 1,513 చౌక దుకాణాలున్నాయి. ఎంఎల్‌ఎస్‌ పాయింట్ల నుంచి ఆయా దుకాణాలకు ప్రతి నెలా రేషన్‌ను సరఫరా చేస్తున్నారు. అక్కడి నుంచి వాహనాల ద్వారా కార్డుదారుల ఇంటివద్దకు వెళ్లి పంపిణీ చేస్తున్నారు. కాగా కొందరు డీలర్లు, అధికారులు కుమ్మక్కై చౌకదుకాణాలకు చేరిన బియ్యాన్ని రైస్‌ మిల్లులకు తరలిస్తున్నారు. డీలర్లు, ఆపరేటర్లు పంపిణీ నిమిత్తం లబ్ధిదారుల వద్దకు వెళ్లినప్పుడు బయోమెట్రిక్‌ తీసుకుని వారికి నగదు ఇచ్చేసి బియ్యంను తమవద్దే ఉంచుకుంటున్నారు. వాటిని మిల్లులకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. కందుకూరు ప్రాంతాల నుంచి వచ్చే బియ్యం కావలికి, ఉదయగిరి, వింజమూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే బియ్యం సంగం, నెల్లూరు రైస్‌మిల్లులకు చేరుతోంది.

ఏం చేస్తున్నారంటే..

చౌకదుకాణాల డీలర్లు లబ్ధిదారుల కేజీ రూ.10కు బియ్యం కొనుగోలు చేస్తారు. వీటిని రైసుమిల్లులకు కేజీ రూ.20 నుంచి రూ.25 చొప్పున విక్రయిస్తున్నారు. వారు పాలిష్‌ పట్టి నాణ్యమైన బియ్యంలో కలిపి బహిరంగా మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విధంగా 25 కేజీల బియ్యం బస్తా రూ.1,400 నుంచి రూ.1,600 వరకు అమ్ముతున్నారు. వీరంతా చిన్న, చిన్న వ్యాపారులు. చెన్నై, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు తరలించే బియ్యం మాఫియా మరొకటి ఉంది. వీరు అవకాశం చూసుకుని రోజుకు 15 నుంచి 20 లారీలను అక్రమ మార్గంలో తరలిస్తున్నారు.

పరిశీలిస్తే..

నగరంలో అధిక శాతం చౌకదుకాణాలకు చిన్న షాపులున్నాయి. వాటిలో నెలకు సంబంధించిన బియ్యం నిల్వ చేయడం సాధ్యం కాదు. ప్రతి నెలా ఎన్ని బస్తాలు పంపిణీ చేస్తారో డీలర్లకు పూర్తి స్థాయిలో అవగాహన ఉంది. డీలర్లు లెక్కలు వేసి పంపిణీ చేయగా మిగిలే బియ్యం బస్తాలను నేరుగా రైస్‌మిల్లులకు పంపుతున్నట్లు తెలిసింది. ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌లో సరఫరా చేసిన రేషన్‌ వివరాలు, చౌకదుకాణాల్లో నిల్వ ఉన్న బియ్యం బస్తాలు పరిశీలిస్తే భారీ స్థాయిలో తేడాలు కనిపిస్తాయి.

తెలిసినా..

బియ్యం అక్రమ రవాణా విషయం తెలిసినా సంబంధిత అధికారులు తమకేం పట్టనట్లు ఉన్నారనే ఆరోపణలున్నాయి. కొందరు ముడుపులు పుచ్చుకుని దీనిని ప్రోత్సహిస్తున్నారని తెలుస్తోంది. ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌ నుంచి బయలుదేరిన వాహనం రూట్‌ మ్యాప్‌ ప్రకారం నిర్దేశించిన చౌక దుకాణాల్లో రేషన్‌ దించాలి. అయితే పలువురు అధికారులు, డీలర్లు కుమ్మక్కు కావడంతో చౌకదుకాణాల్లో సగం బియ్యం అన్‌లోడ్‌ చేసి మిగిలిన దానిని రైస్‌మిల్లులకు తరలిస్తున్నట్లు విమర్శలున్నాయి. చాలా సందర్భాల్లో విజిలెన్స్‌ అధికారుల దాడుల్లో చౌకదుకాణాల్లో బియ్యం నిల్వలు తక్కువగా ఉంటున్నాయి. ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌లో వివరాలు ప్రకారం పూర్తి స్థాయిలో రేషన్‌ సరఫరా చేసినట్లు నమోదు చేస్తున్నారు. చౌకదుకాణాలను ప్రతి నెలా తనిఖీలు చేయాల్సి ఉంది. కొంతకాలంగా అధికారులు రేషన్‌ షాపుల వైపు చూడలేదు. దీంతో అక్రమ రావాణా కొనసాగుతూనే ఉంది.

కఠిన చర్యలు తీసుకుంటాం

క్రమం తప్పకుండా చౌకదుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తాం. రికార్డులు పరిశీలించి రేషన్‌ నిల్వల్లో తేడాలుంటే కేసులు నమోదు చేస్తాం. అక్రమాలకు పాల్పడే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. రైస్‌మిల్లుల్లోనూ తనిఖీలు చేస్తాం. పేదల బియ్యం నిల్వ ఉంటే కేసులు నమోదు చేసి మిల్లును సీజ్‌ చేస్తాం.

– వెంకటరమణ, డీఎస్‌ఓ

జీజీహెచ్‌లో కార్మికురాలికి పాముకాటు

- చికిత్స అందిస్తున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్‌): నెల్లూరు దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లో రత్నమ్మ అనే అవుట్‌ సోర్సింగ్‌ పారిశుద్ధ్య కార్మికురాలిని అత్యంత విషపూరితమైన రక్తపింజరి పాము కాటేసింది. ప్రస్తుతం ఆమె ఐసీయూలో చికిత్స పొందుతోంది. సిబ్బంది కథనం మేరకు.. రోజులాగే రత్నమ్మ సోమవారం విధులకు వచ్చింది. సంబంధిత సూపర్‌వైజర్‌ మెడికల్‌ కళాశాల ఆవరణలో గడ్డిని తొలగించే పనిని ఆమెకు అప్పగించారు. దీంతో గడ్డిని తొలగిస్తుండగా పాము ఆమె చేతి వేలిపై కాటువేసింది. రత్నమ్మ కేకలు వేయగా సహచర సిబ్బంది వచ్చి ఆమెను ఆస్పత్రి క్యాజువాలిటీలో చేర్చారు. డాక్టర్‌ ప్రాథమిక వైద్యం అనంతరం ఐసీయూకి తరలించారు. ఈసీజీ తీశారు. అనంతరం అవుట్‌ సోర్సింగ్‌ ఏజెన్సీ అయిన ఎజైల్‌ గ్రూపు మేనేజర్‌ కొండయ్య మరికొన్ని రక్తపరీక్షలను బయట ల్యాబ్‌లో చేయించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గతంలో ఓ కార్మికురాలి మృతి

గతంలో ఓపారిశుద్ధ్య కార్మికురాలు పెద్దాస్పత్రి ఆవరణలో గడ్డి కోస్తుండగా పాము కాటు వేసింది. తర్వాత భయాందోళనకు, ఒత్తిడికి లోనైంది. రెండో రోజు మృతి చెందింది. ఈ ఘటన అప్పట్లో ఆస్పత్రిలో సంచలనం రేకెత్తించింది. ఆమె మృతితో కుటుంబం వీధిన పడింది. ఏజెన్సీ ఎజైల్‌ సంస్థ తదితరులు సుమారు రూ.లక్ష సాయం అందించారు.


పాముకాటుకి గురైన మహిళను పరీక్షిస్తున్న డాక్టర్‌ శోభారాణి

పెస్ట్‌ కంట్రోల్‌ వైఫల్యం

ఆస్పత్రిలో పాములు లేకుండా, చెదపురుగులు పట్టకుండా, ఎలుకలు లేకుండా చూసే బాధ్యత పెస్ట్‌ కంట్రోల్‌ది. దీనికి సంబంధించి కాంట్రాక్ట్‌ను పొందిన వ్యక్తికి ప్రభుత్వం సంవత్సరానికి సుమారు రూ.50 లక్షలు చెల్లిస్తోంది. అయితే ఆ సంస్థ నిబంధనలు గాలికొదిలేశారని ఆరోపణలున్నాయి. మందును స్ప్రే చేయడం మినహా మిగతా పనులు చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎలుకలు పట్టేందుకు బోనులు పెట్టాలి. పాములు నివసించేందుకు అనువైన పుట్టలు, బొరియలుంటే తొలగించాలి. బొద్దింకలు, ఇతర చెదపురుగులు చేరకుండా మందులు వాడాలి. ప్రతి నెలా రూ.లక్షలో బిల్లులు తీసుకుంటున్నా నిబంధనల మేరకు పని చేయడంలేదని విమర్శలున్నాయి. సరిపడా ఉద్యోగులను నియమించలేదని తెలుస్తోంది. అయినా హాస్పిటల్‌ సూపరింటెండెంట్‌ ఆ ఏజెన్సీకి ఫుల్‌ మార్కులు వేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి లోపాలు సరిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

వ్యాన్‌ బోల్తా

- డ్రైవర్‌కు స్వల్పగాయాలు


పుచ్చకాయలు తీసుకుంటున్న ప్రజలు

వరికుంటపాడు: పుచ్చకాయల లోడుతో వెళ్తున్న వ్యాన్‌ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మండలంలోని రామాపురం వద్ద సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి వ్యాన్‌లో పుచ్చకాయలను వైఎస్సార్‌ జిల్లా బద్వేలుకు తరలిస్తున్నారు. రామాపురం గ్రామం వద్దకు వచ్చేసరికి వ్యాన్‌ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌ స్వల్పంగా గాయపడ్డాడు. పుచ్చకాయలు రోడ్డుపై పడిపోగా స్థానికులు వాటిని తీసుకువెళ్లారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై తిరుపతయ్య తెలిపారు.

కండలేరులో 6.429 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.429 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌ రెగ్యులేటర్‌ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్‌ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సైదాపురంలో వర్షం



సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మారింది. ఆకాశం మేఘావృతమైంది. చల్లని గాలులు వీచి 2 నుంచి 4 వరకు మోస్తరు వర్షం కురిసింది. ఈ వాన నిమ్మకు ఎంతో అనుకూలమని రైతులు చెబుతున్నారు. ఎండతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు వర్షంతో కొంత ఉపశమనం లభించింది.

విద్యుత్‌ మోటార్‌ చోరీ

సోమశిల: అనంతసాగరం మండలంలోని పడమటి కంభంపాడు గ్రామంలోని ఓ రైతు పొలంలో విద్యుత్‌ మోటార్‌ చోరీపై సోమవారం సోమశిల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు అందింది. ఎస్సై సుబ్బారావు కథనం మేరకు.. రైతు ముమ్మిడి వెంకటరామయ్య పొలంలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్‌ మోటార్‌ను ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లి రైతు మోటార్‌ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూక్ష్మ చిత్రాలు భళా


ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు సూక్ష్మ చిత్రాన్ని బహూకరిస్తున్న పద్మారత్నం (ఫైల్‌)


చిత్రాలను రూపొందిస్తూ..

ముత్తుకూరు: సోమా పద్మారత్నం.. ఓ వైపు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మరోవైపు సూక్ష్మ చిత్రాలకు ఊపిరిపోస్తున్నారు. ఈయన ముత్తుకూరు మండలం, నారికేళపల్లి పంచాయతీలోని సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్లో తెలుగు పండితుడిగా పనిచేస్తున్నారు. ఇటు విద్యా రంగంలో, అటు కళా రంగంలో తనదైన ప్రతిభను ప్రదర్శిస్తూ మన్ననలు అందుకుంటున్నారు. పద్మారత్నం 2016లో మొదటిసారిగా బాదం ఆకుపై ఆంధ్రకేసరి చిత్రాన్ని రూపొందించారు. లెక్చరర్‌గా పనిచేసే తన సతీమణి పద్మారాణి పేరులోని 'పద్మ'ను తీసుకొని పద్మారత్నం పేరుతో చిత్రాలను రూపొందించడం మొదలుపెట్టారు.

వివిధ వస్తువులతో..

సూక్ష్మ చిత్రాల రూపకల్పనకు పద్మారత్నం ప్రతి వస్తువును ఉపయోగించుకోవడం విశేషం. సీసాలు, పండ్లు, కాయలు, రావి, మర్రి, వేప ఆకులు, పువ్వులు, పప్పు దినుసులు, కూరగాయలు, విత్తనాలు, గింజలు, క్యాండిల్స్‌, గ్లాసులు తదితర వస్తువులను ఉపయోగించి అందమైన, ఆలోచింపజేసే చిత్రాలను ఆవిష్కరించారు.



రావిఆకుపై..

పేరు తెచ్చిన ప్రముఖుల చిత్రాలు

జయంతులు, వర్ధంతులు, పండగలు, ముఖ్య ఘట్టాలు, సమాజంలోని వివిధ అంశాలకు సంబంధించినవే కాకుండా పద్మారత్నం ఆవిష్కరించిన చిత్రాల్లో మహాత్మా గాంధీ, బీఆర్‌ అంబేడ్కర్, నెహ్రూ, ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సినీ కవి సిరివెన్నెల, ప్రజాప్రతినిధులు, పీఠాధిపతులు, ఉన్నతాధికారులు రంగుల చిత్రాలను వివిధ ఆకులపై చిత్రీకరించి ప్రశంసలు అందుకున్నారు. ప్రముఖుల చిత్రాలకు అందమైన ఫ్రేములు అమర్చి వారికి బహూకరించారు. ఇప్పటి వరకు 1,500లకుపైగా బొమ్మలు, సూక్ష్మ చిత్రాలను ఆవిష్కరించి వండర్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నారు. తన స్కూలు విద్యార్థులకు కూడా బొమ్మలు వేయడం, చవితికి మట్టి బొమ్మలు తయారు చేయడం, అట్టలపై చిత్రాలు గీయడం, వాటికి రంగులు అద్దడంలో కూడా శిక్షణ ఇస్తున్నారు. 2017లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా, 2018లో ఉత్తమ చిత్రకారుడిగా, 2020లో సృజనాత్మక చిత్రకారుడిగా అవార్డులు అందుకున్నారు.

టీవీ రిమోట్‌ ఇవ్వలేదని బాలిక ఆత్మహత్య

- శోకసంద్రంలో కుటుంబం

నెల్లూరు(క్రైమ్‌): టీవీ రిమోట్‌ వల్ల చెలరేగిన వివాదం ఓ బాలిక మరణానికి కారణమైంది. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని శోకసంద్రంలో నెట్టేసింది. ఈ ఘటన నెల్లూరు నగరంలోని పెన్నావారధి సెంటర్‌లో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పెన్నావారధి సెంటర్‌కు చెందిన శివకుమార్, కాంచన దంపతులకు వారికి మహేంద్ర, రాజేశ్వరి (14) అనే పిల్లలున్నారు. శివకుమార్‌ వ్యాపారం చేస్తున్నారు. కుమారుడు ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం, కుమార్తె పదో తరగతి చదువుతున్నారు. సోమవారం టీవీ రిమోట్‌ కావాలని రాజేశ్వరి.. మహేంద్రను అడిగింది. ఈ విషయంలో వారి నడుమ వివాదం జరిగింది. దీంతో బాలిక మనస్తాపానికి గురైంది. ఎవరూ చూడకుండా బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. చీరతో సీలింగ్‌ కొయ్య దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాజేశ్వరి కనిపించకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. బాత్‌రూమ్‌ తలుపు తట్టగా లోపల నుంచి ఎలాంటి అలికిడి లేదు. తలుపునకు లోపల గడియ పెట్టి ఉంది. దీంతో స్థానికుల సహకారంతో తలుపు పగులగొట్టి చూడగా బాలిక ఆత్మహత్య చేసుకుని మృతిచెంది ఉంది. దీంతో కాంచన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సంతపేట ఇన్‌స్పెక్టర్‌ ఎ.సుబ్బరాజు తెలిపారు. రాజేశ్వరి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

చిట్స్‌ నిర్వాహకులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్‌): చిట్స్‌ పేరిట మోసగించి పరారైన నిర్వాహకులపై నెల్లూరు బాలాజీనగర్‌ పోలీసులు చీటింగ్‌ కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన షబానా, సురేష్‌రెడ్డి చిట్స్‌ నిర్వాహకులు. హరనాథపురానికి చెందిన సురేఖ వారి వద్ద రూ.5 లక్షల చిట్స్‌ రెండు వేశారు. కాలపరిమితి తీరిన తర్వాత నగదు ఇవ్వకుండా వాయిదాలు వేస్తూ వచ్చారు. అంతే కాకుండా ఫిబ్రవరిలో సురేఖ వద్ద రూ.4.50 లక్షల నగదు తీసుకున్నారు. అందుకుగానూ ప్రామిసరీ నోట్లు రాసిచ్చారు. చిట్స్‌కు సంబంధించిన నగదు ఇవ్వమని బాధితురాలు వారిని కోరగా రేపు, ఎల్లుండి అంటూ కాలయాపన చేస్తూ ఊరు విడిచి పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు సురేఖ వారిపై సోమవారం బాలాజీనగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్‌ ఎల్‌.వీరానాయక్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు

బ్రాయిలర్‌ (లైవ్‌)	: 152
లేయర్‌ (లైవ్‌)	: 120
బ్రాయిలర్‌ చికెన్‌	: 266
బ్రాయిలర్‌ స్కిన్‌లెస్‌	: 296
లేయర్‌ చికెన్‌	: 204



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.60
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30

